# మీరా

**ఫ్లాష్‌బ్యాక్**

రవీంద్రరాజు పెళ్ళై ముప్పై ఏళ్లు దాటింది. ఆ పెళ్లి రోజుకి కొడుకూ కోడలూ మనవడూ ఇంటికొచ్చారు. అందరూ ఒకూళ్లోనే వున్నా విడివిడిగా వుంటే... వీళ్లకి వాళ్లో- వాళ్లకి వీళ్లో గెస్టుల్లా అప్పుడప్పుడు కలుస్తుంటే బంధాలు బలంగానూ పదిలంగానూ ఉంటాయని... మీరా అబ్బాయికి పెళ్లి కుదరగానే, వేరే ఇల్లు కుదిర్చి పెళ్లవగానే వాళ్లనో ఇంటి వాళ్లని చేసింది!

మీరా తెలివే తెలివి!

మీరా తెలివి తేటలు గురించి తనకి పరిచయం అయిన నాటి నుంచి ఇన్నేళ్లలో ఎన్ని వందలసార్లు అనుకున్నాడో- అలా అనుకున్నందుకు రవీంద్ర ఎప్పుడూ పశ్చాత్తాపపడే అవసరం కూడా రాలేదు. మై వైఫ్ ఈజ్ ఆల్వేస్ కరెక్ట్! అని మీరాని మనస్ఫూర్తిగా ఎప్రిషియేట్ చేసుకుంటాడు. ఎక్కువసార్లు మనస్సులోనే-

తను అంత మెచ్చుకుంటే... "అమ్మ మీరనుకున్నంత తెలివైందేం కాదు డాడీ" అంటూంటాడు కుమారుడు కుమార్.

"కోడల్తో వండించుకుని- మనవడితో ఆడుకుని ఎంజాయ్ చెయ్యకుండా... అక్కడికి మమ్మల్ని నెట్టేసింది..." అదీ పాపం వాడి

అక్కసు.

ఎవర్ని ఎక్కడుంచాలో అక్కడే వుంచడం... అందరికీ తెలియదు. ఆ వుంచేదెలాగో తెలియటం కూడా గొప్ప టాక్టీస్సే! ప్రేమకీ- స్నేహానికి మనం ఒకోసారి హర్ట్ అవుతూ... బలైపోతున్నామంటే దానికి కారణం ఖచ్చితంగా ఎవరో... ఉండవల్సిన దానికన్నా దగ్గరకొచ్చేయటమే.

ఫ్రెండ్స్‌కి ష్యూర్టీ సంతకాలూ- అప్పులూ- ఇచ్చేప్పుడూ, దూర దూరపు చుట్టాలకి కూడా అవసరాల మించి ప్రేమాదరణలు చూపిస్తు న్నప్పుడూ, ఇంకా అనేకానేక సందర్భాలలో మీరా ఇచ్చే సలహాలు సరిగ్గా ఫాలో కాకపోవటం వల్ల రవీంద్ర చాలాసార్లే నాలిక కొరుక్కున్నాడు. అలాంటప్పుడు మీరాయే చాలా తెలివైందని మనస్సులో అనుకుంటాడు.

అసలావిడ తెలివితేటలు చూసే... ఆమెని ఎంచుకున్నాడు. తనకేవన్నా కాస్త తెలివి ఉంటే ఆరోజు మీరాని లైఫ్ పార్టనర్‌ని చేసుకోవాలనుకుని డిసైడ్ చేసుకోవడమే- యస్!! అనుకుంటూంటాడు రవీంద్ర.

**రవీంద్ర అంతర్వాణి**

కేంపస్స్ హాస్టల్‌లో మా బాచ్‌లర్స్ బ్లాకు నెంబరు ఫైవ్.

మా టీము మెంబర్స్ కూడా ఐదుగురమే.

ఎవరికీ చదువుమీద అంత ధ్యాస లేదు... ఇంకో రెండేళ్లైనా, మూడేళ్లయినా ఇక్కడే గడిపేస్తే- అంత త్వరగా నిరుద్యోగ ఫీలింగ్ కమ్ముకోదని హాస్టల్‌లో ఎక్కువమంది చదువుతున్నట్లుగా నటించేస్తూ ఏళ్లు గడిపేస్తుంటారు. అందుకనే వాళ్లందర్లోకి నేనే జూనియర్‌ని.

మొదట్లో నేను ఇన్ఫీరియార్టీ కాంప్లెక్స్‌తో వాళ్లతో బాగా మూవ్ అయ్యే వాణ్ని కాదు గానీ... తరవాత్తరవాత వాళ్లకన్నా మనం బెటర్

అనుకున్నాక... పరవాలేదు లాంటి ఫ్రెండ్షిప్ ఏర్పడింది- వాళ్లు రమ్మన్నప్పుడు పుస్తకాలు మూసేసి సినిమాలకెళ్లడం... చేతనయింది!

ఒక్కోసారి... చదువు కంటే వాళ్లతో షైరెళ్లినా షెటిల్ కెళ్లినా తప్పుకాదనిపించింది.

ఇలా వుండగా మా వాళ్లు బాసరకెళ్దామని ప్రపోజల్ పెట్టారు. నేను వాళ్లతో... ముభావంగానూ తటస్థంగానూ బుద్ధిమంతుల్లానూ ఉండే మొదటి ఏడాదిలో కూడా పిలిచారు నన్ను - వెళ్లలేదు-

పేద్ద సరస్వతీ భక్తుల్లా 2, 3 రోజులు వరస సెలవలు పడితే బాసర వెళ్లిపోవటం ఏంటో... అర్థం కాని విషయం నాకు...

ఈసారి నేను చనువు పెరిగి అడిగాను.

"గురూజీ ఓ మాట... పుస్తకాలూ చదువులూ మీరు చాలా హాబీగా తీసుకుంటారు గదా! బాసర సరస్వతమ్మ మీద అంత గురి ఏంటో.."

"రవి బాబూ... మీరు మమ్మల్ని చాలా అపార్థం చేసుకుంటున్నారు. మా పాపానికి నిష్కృతి లభించటం కోసమే మేము ఈ యాత్ర చేస్తున్నామని మీరు భావించేవరకూ మా ఆత్మ క్షోభిస్తుంది. ఆ నిజం తెల్సి మీరు పశ్చాత్తాప పడేనాటికి, ఈ పాపాత్ముడు ప్రాణం వీడినా మీ అంతరాలని మేల్కొల్పుతూనే వుంటాడు" అన్నాడు శరశ్చంద్ర దగ్గుతూ- రొప్పుతూ... చివరాఖర్లో నవ్వేస్తూ.

మిగిలిన ముగ్గురు ఫ్రెండ్సూ గొల్లున నవ్వారు. ఇంకా గట్టిగా- నేనొక్కణ్నే నవ్వనివాణ్ని- అయోమయంగా అందర్నీ చూశాను.

"బుజ్జి నాన్నా శరత్‌చంద్ర బెంగాలీ నవలల్ని కడుపులో ఉండగా వాళ్లమ్మ చదువుతూంటే వీడు వినేశాడు- నువ్వేం కంగారు పడకు" అన్నాడు త్రిమూర్తులు.

"బాసరలో ఓ సరస్వతమ్మేకాదు- మాకింకో సరసమ్మ ఉందిలే" నేను చెంపలు వాయించుకున్నాను భక్తిగా 'వీళ్లిందుకా వెళ్లేది- ఛీఛీ' అనుకున్నాను.

నేను కూడా రావాలని మావాళ్లు డిమాండ్ చేశారు.

సరస్వతమ్మవారిని చూడ్డానికైతే సెకండ్ థాట్ లేకుండా 'ఓకే' అనేసేవాణ్నేమో... ఇప్పుడు వంకలు వెతుక్కుని చెప్పాను.

"నాకు వంట్లో బాగాలేదు- ఆ గోదావరి స్నానాలు గట్రా చేయలేను- నన్నీసారికీ.."

"సారీల్లేవు - వదలంగాక వదలం" అన్నారు ముక్త కంఠంతో నల్గురూ.

వాళ్లకి నేనిచ్చిన చనువలాంటిది "సరే" అనేశాను.

అందరం అనుకున్న రోజున రైలెక్కేశాం.

బాసర అమ్మవారి గుడికెళ్లే ముందు గోదావరి స్నానం చేస్తారు... భక్తులు ఆచారానువాయితిగా-

అయితే మనవాళ్లది ఈత కొట్టే సరదా!

అయితే... ముందు లగేజీ... 'అక్కడ' పెట్టేద్దాం! అనుకున్నారు. 'అక్కడ' అనే మాట అర్థం నాకు తెల్సిపోయింది.

రైలు ప్రయాణంలో... ఆ అమ్మాయి గురించి వీళ్లు వాడుకునే నానార్థాలూ పర్యాయపదాలూ అన్నీ నా వంటపడ్డాయి.

అక్కడ గుడి ప్రాంగణంలో అన్నీ పూలూ, పళ్లూ, కొబ్బరికాయలూ బొమ్మలూ అమ్మే వరుస దుకాణాలు- ఆ వరసలు దాటుకుంటూ వెళ్తుంటే అందరూ.. వచ్చే యాత్రికులని తమ దుకాణం వద్ద సరుకులు

కొనమని బలవంతంగా బతిమాలడాలు-

ఒక్కో దుకాణం దాటుతూ మేం ముందుకు వెళ్తూన్నప్పుడు వెనుక దుకాణాల వాళ్ల ఆగ్రహంతో చూపులు- ఆ చూసే దుకాణదార్లలో చాలమంది పెద్ద ముత్తయిదువలే- మగాళ్లూ వయో వృద్ధులే!!

అయితే మా గమ్యం మా గ్యాంగ్ లీడర్‌కి తెల్సు- సరాసరి 'అక్కడికి' తీసుకొచ్చి ఆపాడు... మమ్మల్నందర్నీ- చిన్న డిసప్పాయింట్ మెంట్- ఎవడో కుర్రాడు దుకాణంలో కూచున్నాడు... "ఏం కావాలి సార్.."

"మీ... సత్యవతి... లేదా..."

"ఉంది సార్- అక్కా" పిలిచాడు.

"ఆ..." అనుకుంటూ దుకాణం వెనక్కాల ఉన్న చిన్న పార్టీషన్‌లోంచి బైటకొచ్చింది ఆమె...

వస్తూనే అందర్నీ నవ్వుల్తోనూ... కళ్లతోనూ, పేర్లతోనూ పలకరించింది. నేనొకడినే కొత్త వ్యక్తిని... "ఈ సారూ..."

"మా ఫ్రెండ్! ఫస్ట్‌టైమ్ బాసర చూడ్డానికి వచ్చాడు- రవీంద్ర అని మనవాడే..."

ఆమె రెండూ చేతులూ జోడించి దణ్ణం పెట్టింది.

నేను... మారుగా నమస్కారం కూడా చేయలేదు.

'ఇంత అందమైన అమ్మాయి... ఆమె వెనకాల ఎంత చెత్త కథ విన్నాను. ఇదంతా అబద్ధం అయిపోతే బావుణ్ను' ఇలా ఏంటేంటో... ఫీలింగ్స్‌తో నా మనసు మూగపోయింది.

నాలుగు కాకులు కల్సి ఒక కోడిపిల్లని పీక్కుని తింటోన్నట్లు అనిపించింది- అరక్షణం నేను ఐదోవాణ్నా అనిపించింది. కళ్లు

మూసుకుని తలొంచుకుని నిలబడ్డాను. అదే వందనం అయింది.

"మీ ఫ్రెండ్ మరీ జంటిల్మేన్స్" అంది సత్యవతి.

"అదే.. మాకింత జంటిల్మేన్తో పరిచయం ఉందని చెప్తే నీ ముందు మా క్రేజ్ పెరుగుతుందని ఇతన్నిలాక్కొచ్చాం" అన్నాడు శరత్.

"ఓ... గుడ్. అసలు జంటిల్మన్‌లకే సరస్వతీ కటాక్షం ఈజీగా దొరుకుతుంది సార్. మీరు రావటం మంచిదైంది..." నాకు ఆమె మీదకి మళ్లీ చూపు తిప్పడానికి అవకాశం దొరికింది.

నిజంగా చాలా అందంగానే వుంది. అందుకే వీళ్లకి బాసర క్రేజ్ అనుకున్నాను. ఇంకా... ఇంకా.. మావాళ్లతో ఆ అమ్మాయి మాట్లాడు తూన్నంతసేపూ ఆ మాటలేం వినకుండా ఆ అమ్మాయి మీద ప్రేమాభిమానాలు పెంచేసుకుంటున్నాను.

ఏవో మాటలకి మా వాళ్లు నవ్వుతుంటే నేను స్పృహలోకి వచ్చాను.

"ఆ... సత్యవతీ... మేము గోదావరికెళ్తాం- తర్వాత గుడికెళ్లి దర్శనం చేసుకుంటాం!" అన్నాడు శరత్‌చంద్ర.

"భయ్యా- ఇక్కడ నిద్రపోతే అమ్మవారు కల్లో కనపడితే ఏం కోరితే అవిస్తుందట" నాతో అన్నాడు శరత్.

"ఇక్కడ అంటే... 'ఇక్కడ' అని కాదు- గుడిలో" అంది నవ్వుతూ సత్యవతి.

నాకు ఆ అమ్మాయి నవ్వు చూశాక చిరాకేసింది.

"నిద్రపోవాలి- నిద్రలో కల రావాలి" నవ్వాపుకుంటూ అంది.

ఇప్పుడు మా వాళ్లమీద అంతకు ముందున్న కోపం అంతా ఈ అమ్మాయి వైపు తిరిగింది నాకు- అసహ్యం కూడా వేసింది.

మొత్తానికి... మా వాళ్లంతా... గోదావరి స్నానం కోసం వెళ్లారు.

నేను జ్వరంగా వుండి వెళ్లలేదు.

విషయం తెల్సుకుని సత్యవతి జాలిగానో ప్రేమగానో- "మాత్రలు ఏవన్నా వేసుకున్నారా" అడిగింది.

"లేదు.. వేసుకుంటా"

చప్పట్లు కొట్టి ఎదురు టీ దుకాణం వాణ్ని పిలిచి... టీ తెప్పించింది.

"లోపలకెళ్లి కాస్త సేపు రెస్టు తీసుకోండి" అంది.

అక్కర్లేదన్నట్లు బింకంగా నుంచున్నాను.

ఆమె లోపలకెళ్లి కుర్చీ తెచ్చింది. "కూర్చోండి" అని రెండు మూడుసార్లు అన్నాక కూచున్నాను.

"మీరు ఏం చదువుతున్నారు" పొడిగా ఆవిడేసిన ప్రశ్నలకి జవాబు చెప్పాను.

"మీరు మితభాషి అన్నమాట" నా మౌనం వెనుక చిరాకు ఆమెకి కనిపించనీయలేదు. కానీ పసిగట్టింది. తనూ మాట్లాడలేదు. కొంత సేపున్నాక "సత్యవతిగారూ... గోదావరి ఎంత దూరం" అడిగాను.

"గట్టుకీ నీటికీ గొడవొచ్చి జట్టు పచ్చి కొట్టుకున్నాయి- నీరు దూరంగా జరిగి బెట్టు చేస్తోంది- అంచేత... మీ వాళ్లొచ్చేసరికి నలభై ఏభై నిముషాలు పడుతుంది- జలకాలాటలో మీ వాళ్లు కిలకిలలాడితే... ఇంకా లేటు- మీకు బోరు ఖాయం" అంటూ స్థలపురాణం పుస్తకం ఇచ్చింది కాలక్షేపానికి-

"వద్దులెండి.."

"డబ్బులుక్కాదు... నేను ఇంకోళ్లకి అమ్మేస్తారు. నలపకుండా తిరిగివ్వండి'' అంది.

నాకెందుకో ఆ అమ్మాయి మీద సభిప్రాయం పోయినప్పణ్నుంచీ తనేం మాట్లాడినా చెత్త అర్థాలే తోస్తున్నాయి.

అయినా ఆ అమ్మాయి చలాకీతనం మనసు మెచ్చుకుంటోంది.

మాట్లాడాలనిపించింది మగబుద్ధి- ఆమె చెప్పేది... వినాలని పించింది... గుడి గురించీ, యాత్రికుల గురించీ ప్రొఫెషనల్ గైడుకన్నా గొప్పగా చెప్పింది.

అమ్మవారి గురించి చరిత్ర చెప్తూ శ్లోకాలు, మంత్రాలూ ఉదహరిస్తూ బట్టీపట్టినట్లు కాకుండా... నమ్మింది చెప్తోన్నంత గొప్పగా చెప్పింది.

నేను ఇంప్రెస్ అయిపోయాను. ఆ అమ్మాయి ఫేన్ అయి పోయాను- పెళ్లి చేసుకుంటే ఈ అమ్మాయినే చేసుకోవాలి అనుకున్నాను.

అరగంట ముందు- విన్న, కన్న సత్యవతి కాదీమె- ఏది నిజం? నా ప్రశ్న నాలో దాచుకోలేదు. సగౌరవంగా అడిగాను- ఆమె ఏం జవాబు చెప్పినా అభిప్రాయం మారదని నమ్ముతూనే-

అరగంట ముందున్నది... ఆమెది వ్యాపారం కోసం మాటలతో బోల్తా కొట్టించే తత్వం-

ఆ తర్వాత నేను చూసినది... పరిణితి చెందిన జ్ఞానం....

ఆ మాటల వెనక మనిషిలో... అంతర్మథనాన్ని ఆవేదనని చెప్తూ... ఒక మాటంది...

"ఆ సత్యవతి అన్నీ అబద్ధాలు చెప్తుంది సార్... మా దుకాణాల

పోటీ తట్టుకోడానికి అలా చెప్తుంది''

"కొంచెం సేపు నిజాలు చెప్పవా సత్యవతీ'' అన్నాను-

"నా పేరు సత్యవతి కాదండీ... మీరా!'' నేను షాక్!

"ఇవ్వాళ ఉండి వెళ్లిపోయే వాళ్లకోసం కొంచెం నటిస్తే... మాకు లాభం కందడీ!'' అంటూ ఆమె చెప్పిన కథంతా విన్నాను.

✦ ✦ ✦

రవీంద్ర ఫ్రెండ్స్ వెళ్లాక కూడా నాలుగైదు రోజులు అక్కడే ఉండిపోయాడు- తల్లీతండ్రీ లేక, తమ్ముణ్ని పెంచాల్సిన బాధ్యత వహిస్తూ, ఎంత తెలివి తేటల్తో ఎంత నటనతో 22 ఏళ్లు గడిపిందో... ఆర్ద్రంగా విన్నాడు-

ఆమె పడిన, పడుతున్న... కష్టాల్లో తాను సాయపడాలని మనస్ఫూర్తిగా అనుకున్నాడు.

సరస్వతి తోడుగా... ఇంక... ఇలాంటి నిందల్తో నటనల్తో ఆమె ఉండకూడదని నిర్ణయించుకుని అమ్మ ముందు తాళి కట్టి... ఆమె తమ్ముడు విశ్వాన్ని.... మరో చేత్తో పట్టుకుని తీసుకొచ్చేశాడు -

**ముక్తాయింపు**

రవీంద్ర ఆమె తెలివినీ చాకచక్యాన్నీ మెచ్చుకుని మురిసి పోతుండగా ముప్ఫై ఏళ్లు గడిచిపోయాయి-

మీరా తమ్ముడు డాక్టర్ విశ్వ లండన్ నుంచి ఫోన్ చేశాడు. అక్కా బావలకి మేరేజ్ డే గ్రీటింగ్స్ చెప్పడానికి -

మీరా తమ్ముడితో మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్లలో మెరుస్తున్న ఆనందాన్ని చూసి మురిసిపోతున్నాడు రవీంద్ర.